క్లుప్తంగా

వడ్డీమాఫీని సద్వినియోగం చేసుకోవాలి



వడ్డీమాఫీపై అవగాహన కల్పిస్తున్న కమిషనర్

కందుకూరు అర్బన్: పన్ను బకాయిదారులు వడ్డీమాఫీని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ ఎస్. మనోహర్ పిలుపునిచ్చారు. స్థానిక 10వ సచివాలయం పరిధిలో 17, 18 వార్డుల్లో పర్యటించి వడ్డీమాఫీపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మనోహర్ మాట్లాడుతూ పన్నులు చెల్లించడానికి మూడు రోజుల గడువు మాత్రమే ఉందని, సెలవు దినమైన శ్రీరామనవమి రోజు కూడా మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ తెరిచి ఉంటుందన్నారు. పన్నులు సకాలంలో చెల్లించి పురపాలక సంఘ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

గుడ్లూరు: స్థానిక పీహెచ్‌సీని జిల్లా టీబీ అధికారి డాక్టర్ జి.వెంకటప్రసాద్ మంగళవారం తనిఖీ చేశారు. వైద్యశాలలో రికార్డులు, రిజిష్టర్లు పరిశీలించారు. క్షయ వ్యాధితో బాధపడుతున్న వారు మందులు సక్రమంగా వేసుకుంటున్నారా లేదా, ప్రతి నెల వారి గృహాలకు వైద్య సిబ్బంది వెళుతున్నారా లేదా అని వైద్యాధికారి మారుతీరావును అడిగి తెలుసుకున్నారు. మందులు సక్రమంగా వాడితే వ్యాధుల నుంచి బయటపడవచ్చని సూచించారు. వైద్యాధికారి మారుతీరావు, చేవూరు వైద్యాధికారి రాహుల్ క్రిష్ణ ,సీహెచ్‌ఓ భాస్కరరావు పాల్గొన్నారు.

పీఎం కిసాన్‌కు ఈకేవైసీ తప్పనిసరి

హనుమంతునిపాడు: పీఎం కిసాన్‌కు ప్రతి రైతు ఈకేవైసీ తప్పక చేయించుకోవాలని వ్యవసాయాధికారి గోపీకృష్ణ అన్నారు. స్థానిక దాసరిపల్లి రైతు భరోసా కేంద్రంలో మంగళవారం రైతులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సాగు చేసిన పంటలకు ఈ క్రాపు చేయించాలన్నారు. అనంతరం రైతులకు వివిధ పంటలకు సోకే తెగుళ్ల వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సలహాలు ఇచ్చారు. అనంతరం రైతు భరోసా కేంద్రంలో వీఏఏలకు సమీక్ష నిర్వహించారు.

పోలేరమ్మ ఆలయంలో బ్రహ్మానంద సరస్వతి ప్రవచనం

జరుగుమల్లి(కొండపి): మండలంలోని కామేపల్లిలో పోలేరమ్మతల్లి దేవస్థానంలో మంగళవారం ఈఓ శివశంకర్ ఆధ్వర్యంలో నైమిషారణ్య పీఠాధిపతి బాలబ్రహ్మానంద సరస్వతి స్వామి జగన్మాత ఆదిపరాశక్తి తత్వంపై ప్రవచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామీజీకి ఈఓ శివశంకర్ స్వాగతం పలికారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రవచనాలను భక్తులు శ్రద్ధగా విన్నారు.

మాతాశిశు సేవలన్నీ ఆన్‌లైన్ చేయాలి



మాట్లాడుతున్న రమేష్

కందుకూరు అర్బన్: మాతా శిశు సేవలన్నీ ఆన్‌లైన్ చేయాలని నెల్లూరు జిల్లా జాతీయ ఆరోగ్య మిషన్ ప్రోగ్రాం మేనేజర్ డీపీఎం రమేష్ అన్నారు. పట్టణంలోని కోటారెడ్డినగర్‌లోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో ఏఎన్ఎంలకు మంగళవారం ఒక రోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ జాతీయ ఆరోగ్య మిషన్ కార్యక్రమాలను డిజిటలైజేషన్ చేయాలన్నారు. కార్యక్రమంలో రజనీ, డాక్టర్ స్వాతి, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమానికి పెద్ద పీట

- ప్రతి సంక్షేమ పథకంలో వారికి ప్రత్యేక స్థానం
- వైఎస్సార్ ఆసరా ఉత్సవాల్లో ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి
- లబ్ధిదారులకు రూ.8.47 కోట్ల చెక్కు అందజేత



లింగసముద్రంలో ఆసరా చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి

లింగసముద్రం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మహిళా సాధికారతకు పెద్దపీట వేశారని కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయ ఆవరణలో ఆసరా వారోత్సవాల సందర్భంగా ఏపీఎం సింహాద్రిరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రూ.8.47 కోట్ల చెక్కును పొదుపు మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలన్నింటినీ మహిళలకు అందిస్తూ వారిని ఆర్థికంగా బలోపేతం చేస్తున్నారన్నారు. 2014లో టీడీపీ ప్రభుత్వం పొదుపు సంఘాలకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోకపోవడంతో పొదుపు సంఘాలన్నీ డిఫాల్టుగా మారాయన్నారు. ప్రజా సంకల్ప పాదయాత్రలో అక్కాచెల్లెమ్మల బాధలను కళ్లారా చూసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019 ఏప్రిల్ 11 నాటికి ఉన్న పొదుపు సంఘాల బ్యాంక్ లింకేజీ రుణాలను మాఫీ చేస్తానని హామీ ఇచ్చి, నేడు నాలుగు విడతలుగా వారి నిధులు విడుదల చేస్తున్నారని చెప్పారు. సంక్షేమ పథకాలన్నీ అమలు కావాలంటే మళ్లీ జగనన్ననే సీఎంగా గెలిపించుకోవాలన్నారు. నాడు–నేడు పథకంలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయయన్నారు. వైద్యరంగానికి పెద్ద పీట వేస్తూ మండలానికి రెండు పీహెచ్‌సీలు నలుగురు వైద్యులను నియమించి ఇంటింటికీ వైద్య సేవల కార్యక్రమాన్ని ప్రారంభింఆరని కొనియాడారు. మహిళలను భాగస్వాములు చేస్తూ ప్రతి మండలంలో మహిళా మార్టులను ఏర్పాటు చేస్తున్నారన్నారు. కందుకూరులో ఇప్పటికే మహిళా మార్టును ప్రారంభించామని చెప్పారు. మహిళలు తయారు చేసిన వస్తువులను ఈ మార్టుల్లో అమ్ముకోవచ్చన్నారు. లింగసముద్రంలో కూడా మహిళా మార్టును ఏర్పాటు చేస్తామన్నారు. గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి తేడా గమనించాలని ముఖ్యమంత్రి చేస్తున్న మంచి పనులకు ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పెన్నా క్రిష్ణయ్య, తహసీల్దార్ సుధాకరరావు, ఎంపీడీఓ శేషుబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పి.తిరుపతిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ వి.క్రిష్టారెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వెలుగు సీసీలు, వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

- ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి



అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి

లింగసముద్రం: భూ సమస్యలను రెవెన్యూ సిబ్బంది సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. భూ సమస్యలపై వచ్చే అర్జీలను విచారించి సత్వరమే పరిష్కరించాలని తహసీల్దార్‌కు సూచించారు. పెదపవని, ముత్యాలపాడు, మొగిలిచర్ల, ఆర్‌ఆర్‌పాలెం, పెంట్రాల గ్రామాలకు సంబంధించిన రెవెన్యూ రికార్డుల్లో గతంలో పనిచేసిన రెవెన్యూ అధికారులు ట్యాంపరింగ్ చేశారని, వాటిని క్షుణ్ణంగా పరిశీలించి అర్హులకు న్యాయం చేయాలన్నారు. పెదపవనిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మించేందుకు ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించగా..ఆ స్థలం తనదని ఓవ్యక్తి కోర్టుకు వెళ్లాడని, కోర్టు నుంచి ఉత్తర్వులు ఏమైనా వచ్చాయా అని తహసీల్దార్‌ను అడిగారు. చినపవని వద్ద ఉన్న ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ క్షేత్రానికి ప్రభుత్వం భూములు ఇచ్చినా ఇంతవరకు ఆ భూములు సర్వే చేసి హద్దులు ఎందుకు వేయలేదన్నారు. వ్యవసాయక్షేత్రం భూములు సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు చెప్పారు. లింగసముద్రం తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి మంగళవారం రెవెన్యూ సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని చెప్పారు. అనంతరం అధికారులతో సమావేశమై రెవెన్యూ సమస్యలపై చర్చించారు. కందుకూరు డీఎస్పీ కండే శ్రీనివాసులు, ఎంపీడీఓ శేషుబాబు, ఆర్‌ఐ హనుమాయమ్మ, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

బేళ్లలో అన్య పదార్థాలు ఉండరాదు



వేలం ప్రక్రియను పరిశీలిస్తున్న బోర్డు అధికారులు

కందుకూరు: పొగాకు బేళ్లను అన్య పదార్థాలు లేకుండా చూడాలని దక్షిణ ప్రాంత తేలిక నేలల బోర్డు రీజనల్ మేనేజర్ ఎం లక్ష్మణరావు, విస్తరణ మేనేజర్ దామోదర్, సురేఖ అన్నారు. స్థానిక రెండో వేలం కేంద్రంలో జరుగుతున్న పొగాకు వేలాన్ని మంగళవారం పరిశీలించారు. వేలం జరుగుతున్న తీరును అధికారులు, రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేలంలో పాల్గొంటున్న కంపెనీల ప్రతినిధులకు రైతులకు మెరుగైన ధరలు వచ్చేలా చూడాలన్నారు. పొగాకును బేళ్లు కట్టే సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పొగాకు అన్యపదార్థాలు బేళ్లలో ఉంటే కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో లభిస్తున్న ధరలకు అనుగుణంగా బేళ్లను వేలం కేంద్రానికి తీసుకురావాలని సూచించారు. ఈ ఏడాది పొగాకు చూర, మొక్కను కూడా కొనుగోలు చేసేందుకు బోర్డు అనుమతిచ్చిందని చెప్పారు. రైతులు దళారులకు అమ్ముకోకుండా నేరుగా బోర్డులోనే అమ్ముకుని మంచి ధరలు పొందాలన్నారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించి రైతులకు నిత్యం అందుబాటులో ఉండాలని, వేలం జరిగే తేదీలను క్లస్టర్‌ల వారీగా రైతులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని సూచించారు. వేలం నిర్వహణాధికారి రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పొగాకు కనిష్ఠ ధర రూ.160

టంగుటూరు: స్థానిక వేలం కేంద్రంలో మంగళవారం పొగాకు కనిష్ఠ ధర కేజీ రూ.160కి పడిపోయింది. టంగుటూరు, సాదువారిపాలెం, జరుగుమల్లి, వావిలేటిపాడు గ్రామాల రైతులు 1036 బేళ్లను వేలానికి ఉంచగా 973 కొనుగోలయ్యాయి. గరిష్ఠ ధర రూ.200, సరాసరి ధర రూ.194.13 పలికిందని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

పోషకాహారంతో రక్తహీనత నివారణ



పక్షోత్సవంలో పాల్గొన్న అంగన్‌వాడీలు

కందుకూరు అర్బన్: గర్భిణులు, బాలింతలు, పిల్లలు క్రమం తప్పకుండా పోషకాహారం తీసుకుంటే రక్తహీనత నివారించవచ్చని సీడీపీఓ శర్మిష్ఠ అన్నారు. పోషణ పక్వాడ పక్షోత్సవం కార్యక్రమాల్లో భాగంగా స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో చిరుధాన్యాలు ఉపయోగించి తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలపై అవగాహన కలిగిస్తూ వంటల పోటీలు మంగళవారం నిర్వహించారు. పోటీలో గెలుపొందిన విజేతలు అనూష, ఆదిలక్ష్మి, రోహిణి, మాధవి, అంగన్‌వాడీ కార్యకర్తలకు బహుమతులు అందజేశారు. సీడీపీఓ శరిష్ఠ మాట్లాడుతూ పోషక విలువలు కలిగిన చిరుధాన్యాల్లో ఎక్కువ శాతం విటమిన్స్ ఉంటాయని తెలిపారు. పోషకాలు అధికంగా కలిగిన ఆహారం తీసుకుంటే ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనివ్వవచ్చని సూచించారు. బాల్య వివాహాలు అరికట్టడంపై అవగాహన కల్పించారు. డాక్టర్ స్వాతి, డాక్టర్ బ్యూలాగ్రేస్, సూపర్‌వైజర్ అంజమ్మ, షకీలా బేగం, హెల్త్ సూపర్‌వైజర్ పద్మావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

వెలిగండ్ల: స్థానిక కస్తూరిబా బాలికల పాఠశాలలో 6,7,8,9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లతో పాటు ఇంటర్మీడియెట్‌లో ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రత్యేకాధికారి కొండమ్మ తెలిపారు. ఏప్రిల్ 20వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 6వ తరగతిలో 40 సీట్లు, 7వ తరగతిలో 4, 8వ తరగతిలో 3, 9వ తరగతిలో 3, ఇంటర్‌మీడియట్‌కు 40 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. పూర్తి వివరాలకు 7702076048, 9705696386 నంబర్లను సంప్రదించాలని ప్రత్యేకాధికారి కొండమ్మ తెలిపారు.

హాస్టల్స్ ఆకస్మిక తనిఖీ



సమస్యలు తెలుసుకుంటున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: పట్టణంలోని పలు హాస్టల్స్‌ను మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. గార్లపేట రోడ్డులో ఉన్న బీసీ బాలుర వసతి గృహాన్ని, ఎస్సీ వసతి గృహాన్ని తనిఖీ చేసి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. హాస్టల్స్ కనీస సౌకర్యాలు లేకపోవడం, టాయిలెట్స్ అపరిశుభ్రతగా ఉండటంపై అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థులు తాగునీటి సౌకర్యం లేదని, వాడుక నీటికి ఇబ్బందులు పడుతున్న వివరించారు. ఈ సందర్భంగా చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ మోనూ ప్రకారం భోజన అమలు చేయాలని, బీసీ హాస్టల్స్‌లో టాయిలెట్స్‌ను పరిశుభ్రతగా ఉంచాలని వార్డెన్‌లను ఆదేశించారు. హాస్టల్‌లో నూతన బోర్‌వెల్ వేయించి నీటి సమస్య తీర్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. స్థానిక వార్డు కౌన్సిలర్ రామనబోయిన ప్రశాంతి శ్రీనివాస్, 12వ వార్డు కౌన్సిలర్ శ్రీరాం సతీష్, టెలికాం అడ్వయిజరీ కమిటీ మెంబర్ ఎస్‌కే జానీబాష, వైఎస్సార్ సీపీ నాయకులు కంటు గురవయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. తొలుత వార్డుల్లో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, కౌన్సిలర్లు రామనబోయిన శ్రీను, శ్రీ రాం సతీష్‌లు పర్యటించి సమస్యలు తెలుసుకుని తక్షణ చర్యలకు అధికారులను ఆదేశించారు.

స్వచ్ఛ కనిగిరి అందరి బాధ్యత

- కమిషనర్ డీవీఎస్ నారాయణరావు



తడి, పొడి చెత్తల ఎరువును వార్డులో ఇస్తున్న వైస్ చైర్మన్, కమిషనర్

కనిగిరి రూరల్: స్వచ్ఛ కనిగిరి అందరి బాధ్యతని మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణరావు అన్నారు. పట్టణంలోని 18వ వార్డులో వైస్ చైర్మన్ పులి శాంతి గోవర్ధన్ ఆధ్వర్యంలో స్వచ్ఛతపై మంగళవారం ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ నారాయణరావు మాట్లాడుతూ తడి చెత్త, పొడి చెత్త వేరు చేసే విధానం, సేకరించిన ఆ రెండు చెత్తలను వచ్చిన ఎరువుల గురించి వివరించారు. వైస్ చైర్మన్ పులి శాంతి గోవర్ధన్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. కౌన్సిలర్ దేవకి రాజీవ్, సిరుప వెంకట గోవర్ధన్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చెన్నకేశవులు, శానిటరీ సెక్రటరీ మాలకొండయ్య, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

నూరుశాతం ఫలితాలు సాధించాలి



విద్యార్థులకు ప్యాడ్‌లు అందచేస్తున్న ఎంఈఓ

గుడ్లూరు: పదో తరగతిలో నూరు శాతం ఫలితాలు సాధించాలని ఎంఈఓ వెంకటేశ్వర నాయక్ అన్నారు. మండలంలోని మాచవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల వార్షిక వేడుకలు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.మాల్యాద్రి అధ్యక్షతన మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రమశిక్షణ పాటిస్తే జీవితంతో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు. గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు క్రిష్టిపాటి శ్రీనివాసులురెడ్డి ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకు సాధిస్తే రూ.40 వేలు, పాఠశాల ప్రథమస్థానంలో నిలిస్తే రూ.10 వేలు, ద్వితీయస్థానంలో నిలిస్తే రూ.5 వేలు, తృతీయస్థానంలో నిలిస్తే రూ.3 వేలు అందజేస్తామన్నారు.

ముగిసిన ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలు



పామూరు: ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. చివరి రోజు మొత్తం 779 మంది విద్యార్థులకు గాను 62 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 293 మందికి గాను 277 మంది, ఓమేగా జూనియర్ కళాశాలలో 280 మందికి గాను 255 మంది, ఆదిత్య జూనియర్ కళాశాలలో 206 మందికి గాను 185 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను ఆయా కళాశాల కేంద్రాల్లో డీఓలు కోటిసాహెబ్, రామరాజు, మురళి, చీఫ్ సూపరింటెండెంట్‌లు పీవీ నారాయణ, గుత్తి వెంకట రమణయ్య, హజరత్తయ్యలు పర్యవేక్షించారు.

ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు పూర్తి

టంగుటూరు: స్థానిక పోతుల చెంచయ్య మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారంతో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు పూర్తయ్యాయి. చివరి రోజు పరీక్షకు 101 మంది విద్యార్థులకుగాను 91 మంది హాజరయ్యారని కళాశాల అధ్యాపకుడు లక్ష్మణరావు తెలిపారు. ఎస్సై ఖాదర్ బాషా, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

ఘనంగా పాఠశాల వార్షిక వేడుకలు



సరస్వతి పూజలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

గుడ్లూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షిక వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పాఠశాల ఆవరణలోని చదువుల తల్లి సరస్వతి దేవి విగ్రహం వద్ద 10 వ తరగతి విద్యార్థులు పాఠశాల సీనియర్ ఉపాధ్యాయురాలు ఆర్.సులోచన ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో పాల్గొన్న బసిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సలీంబాష మాట్లాడుతూ జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరాలంటే పదో తరగతి తొలి మెట్టు అన్నారు. ప్రతి విద్యార్థి ఇష్టం చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. నూరుశాతం ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకునిపై దాడి



గాయపడిన శ్రీనివాసరాజు

సీఎస్‌పురం(పీసీపల్లి): మండల పరిధిలోని చింతపూడి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకునిపై టీడీపీ నేత దాడి చేశాడు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ప్రజలను ఇబ్బందులను గురిచేస్తున్న టీడీపీ నాయకులను వైఎస్సార్ సీపీ నాయకుడు శ్రీనివాసరాజు మందలించాడు. దీంతో అతనిపై ఆగ్రహం పెంచుకున్న టీడీపీ మాజీ సర్పంచ్ నరసింహరాజు మంగళవారం సచివాలయం దగ్గర నుండి వెళ్తున్న శ్రీనివాసరాజుపై కర్రతోటి దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. గాయపడిన శ్రీనివాసరాజును స్థానికులు పామూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కందుకూరుకు తరలించారు.

చలో ఢిల్లీని జయప్రదం చేయండి

పీసీపల్లి: ఉపాధి హామీ సమస్యల పరిష్కారం కోరుతూ ఏప్రిల్ 5న జరిగే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు బడుగు వెంకటేశ్వర్లు కోరారు. మండల పరిధిలోని నేరేడుపల్లి గ్రామంలో ఉపాధి హామీ పనులు జరిగే ప్రదేశానికి వెళ్లి పరిశీలించారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని, దీన్ని ప్రతి ఒక్కరూ ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు.

అంకాలమ్మకు ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

హనుమంతునిపాడు: మండలంలోని లింగంగుంట్లలో సోమవారం రాత్రి జరిగిన అంకాలమ్మ తిరునాళ్లలో ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అంకాలమ్మకు గ్రామస్తులు ప్రత్యేక తిరునాళ్ల ఉత్సాహం గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి, కన్వీనర్ యక్కంటి శ్రీనివాసులరెడ్డి, భవనం క్రిష్టారెడ్డి, వైస్ ఎంపీపీ బెంజి, వెంకట కాశయ్య, ఎస్. సాంబిరెడ్డి, చెక్కా రాము, టి.తిరుపతిరెడ్డి, సర్పంచ్ ఎం రత్న, బీసీ నాయకుడు ఎం తిరుపతయ్య పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పొన్నలూరు: మండలంలోని మాలపాడు కేజీబీవీలో 2023–24కుగాను ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రత్యేకాధికారి బి.సుభాషిణి మంగళవారం తెలిపారు. విద్యాలయంలో ఎంపీసీ గ్రూపులో 40 సీట్లకు మాత్రమే అవకాశం ఉందని, ఏప్రిల్ 20లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.